క్లుప్తంగా

వరసిద్ధి వినాయకునికి విశేష పూజలు



హోమం చేస్తున్న భక్తులు

రావికమతం: టి.అర్జాపురం బాల వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో స్వామివారికి ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పంచామృతాలు, పండ్ల రసాలతో ప్రత్యేక అభిషేకాలు, హోమం నిర్వహించారు. సంకష్టహర చతుర్థి సందర్భంగా పలువురి దంపతులతో అర్చకుడు లక్ష్మణరావు దూర్వాయుగ్మార్చన, ప్రత్యేక పుష్పార్చన, విశేష సుగంధ ద్రవ్యాలతో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు.

భూమికి 'పచ్చ'ని రంగేసినట్టు!



మెరక రామచంద్రపురం పొలాల్లో పచ్చగా దర్శనమిస్తోన్న వరినాట్లు

కె.కోటపాడు: కింతాడ శివారు మెరక రామచంద్రపురం గ్రామంలో వరినాట్లు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. కనుచూపు మేరలో వరినాట్లు పూర్తవడంతో ఇక్కడ పొలాలన్నీ పచ్చని రంగు పూసుకున్నాయి. ఖరీఫ్‌లో భాగంగా ఇటీవల వేసిన నాట్లుతోపాటు కురుస్తున్న వర్షాలకు రోడ్డును ఆనుకున్న పొలాలు పచ్చదనంతో వాహనదారులను ఆకట్టుకుంటున్నాయి.

సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న పిల్లలు

మాకవరపాలెం: సంస్కృతి, సంప్రదాయాలపై పిల్లలకు అవగాహన కల్పిస్తున్నట్టు సమరసతా సేవా ఫౌండేషన్ ప్రచారకర్త రత్నమాల తెలిపారు. స్థానిక రామాలయంలో ఆదివారం నుంచి పిల్లలకు భక్తిభావం పెంచేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మహాభారతంలోని శ్లోకాలను నేర్పించడంతోపాటు సంస్కృతి, సంప్రదాయాలపై వివరించారు. ప్రతి ఆదివారం పిల్లలకు భక్తి భావం పెంపొందించే దిశగా కార్యక్రమాలు చేపడతామని రత్నమాల తెలిపారు.

చిన్నారులకు స్పోకెన్ ఇంగ్లిష్



స్పోకెన్ ఇంగ్లిష్ బోధిస్తున్న ఉపాధ్యాయిని భవాని, గ్రంథాలయ అధికారి దమయంతి

నర్సీపట్నం: స్థానిక శాఖా గ్రంథాలయంలో చిల్డ్రన్ క్లబ్ నిర్వహించారు. పిల్లలు కథల పుస్తకాలు చదువుకున్నారు. అనంతరం చిన్నారులకు స్పోకెన్ ఇంగ్లిష్‌పై తర్ఫీదు ఇచ్చారు. ఉపాధ్యాయిని సిహెచ్.భవాని స్పోకెన్ ఇంగ్లిష్‌ను బోధించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి దమయంతి మాట్లాడుతూ పిల్లలకు గ్రంథాలయాలపై మక్కువ పెంచేందుకు ప్రతి ఆదివారం చిల్డ్రన్ క్లబ్ నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థి దశ నుంచి గ్రంథాలయాలకు రావటం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకరరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ఎస్.రాయవరం: కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో 2008–09 సంవత్సరాల్లో 10 వ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకుని అలనాటి తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. పాఠశాల దశ నుంచి వెళ్లాక 15 ఏళ్ల తరువాత తామంతా కలుసుకోవడం మంచి అనుభూతిని ఇచ్చిందని చెప్పారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గడిపిన పూర్వ విద్యార్థులు తాము స్థిరపడ్డ రంగాలపై చర్చించుకున్నారు. తమతో చదువుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడే వారిని ఆదుకోవాలని స్నేహితులు తీర్మానించారు.

బుచ్చెయ్యపేట.. అభివృద్ధి 'బాట'



విశాలంగా ఏర్పాటు చేస్తున్న కేబీ రోడ్డు



అధ్వానంగా కేబీ రోడ్డు

- మండలంలో శరవేగంగా తారురోడ్ల నిర్మాణం
- ఎర్రవాయి గ్రామాలకు తీరనున్న రవాణా కష్టాలు
- విప్ కరణం ధర్మశ్రీ కృషితో రూ.150 కోట్లతో పనులు

బుచ్చెయ్యపేట: ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కృషితో గ్రామీణ ప్రజలకు రవాణా కష్టాలు తొలగనున్నాయి. ఇప్పటికే పుష్కలంగా నిధులు మంజూరు చేయడంతో బుచ్చెయ్యపేట మండలంలోని పలు గ్రామాల్లో రోడ్ల నిర్మాణ పనులు శర వేగంగా కొనసాగుతున్నాయి. ప్రధాన రోడ్లతోపాటు గ్రామాలకు వెళ్లే లింకు రోడ్ల సైతం నిర్మిస్తున్నారు. ఈ పనులకు రూ.150 కోట్లు ప్రభుత్వ విప్ ధర్మశ్రీ మంజూరు చేయించారు. ఈ నిధులతో చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులను అధికారుల పర్యవేక్షణలో నాణ్యతా ప్రమాణాలతో చేస్తున్నారు.

రూ.32 కోట్లతో బంగారుమెట్ట, కశింకోట రోడ్డు...

పదేళ్లుగా శిథిలమైన బంగారుమెట్ట, కశింకోట (కేబీ) రోడ్డును రూ.32 కోట్లతో నిర్మిస్తున్నారు. 24 కిలోమీటర్ల మేర ఈ రోడ్డు పనులు ఇప్పటికే తొంభై శాతం పూర్తయ్యాయి. బుచ్చెయ్యపేట, రావికమతం, మాడుగుల, అనకాపల్లి మండలాల ప్రజలకు ఉపయోగపడే ఈ రోడ్డులో 13 కల్వర్టులు, నాలుగు వంతెనలు నిర్మిస్తున్నారు. మరో నెల రోజుల్లో ఈ రోడ్డు పనులు పూర్తయితే నాలుగు మండలాలకు చెందిన సుమారు వంద గ్రామాల ప్రజల రాకపోకలకు అనువుగా ఉంటుంది.

- రాజాం, తట్టబంద(ఆర్టీ) రోడ్డు నుంచి సీతయ్యపేట హైస్కూల్ జంక్షన్ నుంచి రాజుపాలెంకు రూ.1.34 కోట్లతో రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. సుమారు రెండు కిలోమీటర్ల మేర పొడవున్న ఈ రోడ్డులో ఇప్పటికే గ్రావెల్ పూర్తిగా వేసి రోలింగ్ చేశారు. మట్టి రోడ్డు పనులు పూర్తికాగా, పిక్క వేసి గ్రావెల్‌తో రోలింగ్ చేసి తారురోడ్డు వేయడానికి అధికారులు పనులు చేస్తున్నారు. ఈ రోడ్డు పూర్తయితే పీపీ అగ్రహారం, రాజుపాలెం, పెదపూడికి వెళ్లే గ్రామాల ప్రజలకు రవాణా సదుపాయం కలుగుతుంది.
- కేపీ అగ్రహారం రోడ్డు నుంచి అయితంపూడి గ్రామానికి రూ.77 లక్షలతో రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్డు గ్రావెల్, పిక్క వేసి రోలింగ్ చేయగా, కల్వర్టు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కల్వర్టు పనులు పూర్తయిన వెంటనే తారురోడ్డు వేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు.
- కేబీ రోడ్డులో రాజాం జంక్షన్ నుంచి పెదమదీన, గున్నెంపూడి గ్రామాలకు వెళ్లే రోడ్డును రూ.1.83 కోట్లతో నిర్మిస్తున్నారు. సుమారు ఐదు కిలోమీటర్ల మేర ఈ రోడ్డును జేసీబీతో వెడల్పు చేసి గ్రావెల్ వేసి లెవిలింగ్ పనులు చేస్తున్నారు.
- పోలేపల్లి, బుచ్చెయ్యపేట, కేపీ అగ్రహారానికి వెళ్లే రోడ్డును రూ. 86 లక్షలతో ఏర్పాటు చేస్తున్నారు.

– గంధవరం నుంచి వడ్డాది మీదగా అర్జాపురం వరకు భీమునిపట్నం, నర్సీపట్నం(బీఎన్) రోడ్డు పనులు రూ.1.10 కోట్లతో జరుగుతున్నాయి.

అన్ని గ్రామాలకు రవాణా సదుపాయం: ధర్మశ్రీ

మూడు నెలల్లో రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయించి ఎర్రవాయి ప్రాంతంగా పేరొందిన బుచ్చెయ్యపేట మండల ప్రజలకు రవాణా కష్టాలు తొలగిస్తానని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. అన్ని గ్రామాలకు రవాణా సదుపాయం కల్పిస్తానన్నారు.



మట్టిరోడ్డు పూర్తి చేయడంతో రాజుపాలెం గ్రామస్తుల ఆనందం



బీఎన్ రోడ్డులో తారురోడ్డు నిర్మాణ పనులు



అయితంపూడి రోడ్డులో గ్రావెల్ పనులు

ఆర్థిక ఇబ్బందులున్నా కొత్త పింఛన్ల మంజూరు

వైస్ ఎంపీపీ కొల్లు అప్పలనాయుడు



కొత్త పింఛను అందజేస్తున్న వైస్ ఎంపీపీ సన్యాసినాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు అప్పలనాయుడు

రోలుగుంట: ఆర్థిక ఇబ్బందులున్నా కొత్తగా పింఛన్లు మంజూరు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైస్ ఎంపీపీ కొల్లు సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మడ్డు అప్పలనాయుడు తెలిపారు. కుసుర్లపూడి పంచాయతీకి కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాల పాలనలో అధికారులు, నాయకుల చుట్టూ పింఛన్ల కోసం తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు అర్హుల ఇళ్లకు వలంటీర్లే వచ్చి అవసరమైన ధ్రువపత్రాలు తీసుకొని, ప్రభుత్వ కార్యాలయాలకు అందజేసి మంజూరు చేయించే సంప్రదాయం అమలవడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. ఇదే సాంప్రదాయం కొనసాగించాలంటే రాబోయే ఎన్నికల్లోనూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. పార్టీ సీనియర్ నాయకుడు సబ్బవరపు పెద్దినాయడు, జెడ్పీ, ఎంపీపీ పాఠశాలల పీఎంసీ చైర్మన్లు గొల్లు రాజుబాబు, చుక్కా సత్తిబాబు పాల్గొన్నారు.

అంతర పంటలతో అదనపు ఆదాయం

మెట్ట ప్రాంతాల్లో అధికంగా సాగు



సూదివలసలో మామిడిలో అంతర పంటగా బరబాటి సాగు

కె.కోటపాడు: అంతర పంటల సాగుపై పలు గ్రామాల్లో రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలో మెట్ట ప్రాంతాల్లో విస్తారంగా మామిడి తోటలు ఉన్నాయి. మామిడి కాపు ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఉంటోంది. అనంతరం ఈ తోటల మధ్య ఖాళీ ప్రదేశాల్లో కూరగాయల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ విధానం ద్వారా తక్కువ కాలవ్యవధిలో దిగుబడి వచ్చే కాయగూరల సాగు ద్వారా అదనపు ఆదాయం పొందుతున్నారు. ప్రధానంగా మండలంలో పాతవలస, పిండ్రంగి, మర్రివలస, గొట్లాం, సూదివలస, బొట్టవానిపాలెం, కె.సంతపాలెం గ్రామాల్లోని మామిడి తోటల్లో బరబాటి, బెండ, వంగ, టమాటా పంటలను సాగు చేస్తున్నారు.

హెచ్చరిక బోర్డు పెట్టినా బేఖాతరు

ప్రభుత్వ భూముల్లో అక్రమంగా ఇళ్ల నిర్మాణం



ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేస్తున్న దృశ్యం

గొలుగొండ: గుండిపాల గ్రామ రెవెన్యూ పరిధి 123 సర్వే నంబర్‌లో గోర్జు భూములను ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేయడంపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఇక్కడ ప్రభుత్వ భూములను నలుగురు వ్యక్తులు ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేయడంపై ఇప్పటికే స్పందనలో ఫిర్యాదులు చేశారు. ఈ భూములు ప్రభుత్వానికి చెందినవిగా మండల రెవెన్యూ అధికారులు ఆర్నెల్ల క్రితం బోర్డులు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ అక్రమ నిర్మాణాలు ఆపలేదు. దీనిపై గ్రామ రెవెన్యూ అధికారి నారాయణమూర్తిని సంప్రదించగా సదరు భూముల్లో ఎటువంటి కట్టడాలు చేయొద్దని, ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. వెంటనే చర్యలు తీసుకుని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

వలంటీర్ల మానవత్వానికి సలాం..



విశాఖపట్నం ఆస్పత్రిలో బుల్లెమ్మకు పింఛన్ అందజేస్తున్న శ్రీరాంపట్నం వలంటీర్ నాగేంద్ర



అనకాపల్లి ఆస్పత్రిలో కామేశ్వరికి పింఛన్ అందిస్తున్న చోడవరం వలంటీర్ ఉష

- ఆస్పత్రులకు వెళ్లి పింఛన్ల అందజేత

చోడవరం: వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి.. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి అందించిన విశేష సేవలతోపాటు సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయడంలోనూ సర్వత్రా ప్రశంసలు అందుకుంటున్నారు. తాజాగా వివిధ అనారోగ్య సమస్యలతో పలు ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందుతున్న పింఛనుదారులకు నెలవారీ పింఛన్లు అందించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. చోడవరం సచివాలయం–2 పరిధిలో పుట్రేవు కామేశ్వరి అనే వృద్ధురాలు అనారోగ్యంతో అనకాపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ ఉష అక్కడకు వెళ్లి ఆమెకు రూ. 2750 పింఛన్ అందజేశారు. శ్రీరాంపట్నానికి చెందిన పండూరి బుల్లెమ్మ అనే వృద్ధురాలు విశాఖపట్నంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతోంది. సంబంధిత వలంటీర్ గొంపా నాగేంద్ర అక్కడకు వెళ్లి పింఛన్ నగదు అందజేశారు. ఖండిపల్లి గ్రామానికి చెందిన పెంటకోట సన్యాసిరావు అనే వృద్ధుడు గాజువాక షీలానగర్‌లో ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, సంబంధిత వలంటీర్ అప్పికొండ కనకంబాబు పింఛన్ సొమ్ము అందజేశారు. తమకు అవసరానికి సకాలంలో కష్టమని భావించకుండా ఆస్పత్రులకు వచ్చి పింఛన్ సొమ్ము ఇచ్చిన ఆయా వలంటీర్లను పింఛన్‌దారులు, ప్రజలు అభినందిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఈ వలంటీర్ వ్యవస్థ ఉండబట్టే తమకు ఇంతదూరమైన వచ్చి పింఛన్ ఇచ్చారని, పింఛన్‌దారులు ఆనందం వ్యక్తం చేశారు.



గాజువాక ఆస్పత్రిలో సన్యాసిరావుకు పింఛన్ అందిస్తున్న ఖండిపల్లి వలంటీర్ కనకంబాబు

సీఐటీయూ మండల కన్వీనర్‌గా సోమునాయుడు



వడ్డాది సమావేశంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

బుచ్చెయ్యపేట: సీఐటీయూ మండల కన్వీనర్‌గా ఆర్. సోమునాయుడు ఎన్నికయ్యారు. ఆదివారం వడ్డాది కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సీఐటీయూ మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల నాయకులంతా కలిసి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కో కన్వీనర్‌గా శ్రీరామమూర్తి, అంగన్‌వాడీ యూనియన్ లీడర్‌గా అమ్మాజీ, మధ్యాహ్న భోజన తయారుదార్ల సంఘం అధ్యక్షురాలిగా ఉమామహేశ్వరి, భవన నిర్మాణ రంగం నుంచి భాస్కర్, ముఠా కార్మికుల సంఘ నాయకుడిగా సూరిబాబు, ఉపాధి హామీ పథకం నుంచి రవణమ్మ తదితరులను ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు ప్రేమ్ చంద్రశేఖర్, పినపాత్రుని సాంబశివరావు, రామలక్ష్మి, మంగలక్ష్మి, గూనూరు వరలక్ష్మి పాల్గొన్నారు.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కె.జె.పురంలో మోదమాంబ

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసం కావడంతో ఆదివారం తెల్లవారు జాము నుంచి అమ్మవారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. వీరు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది.

మాడుగుల రూరల్: కె.జె.పురంలో మోదమాంబకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కె.జె.పురం చెరకు కాటా ఆవరణలో నూకాంబిక అమ్మవారికి పూజలు నిర్వహించారు. రాత్రికి భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నిత్యావసర ధరలు తగ్గించాలని ప్రచారం



రామచంద్రపురంలో కరపత్రాలు అందజేస్తున్న నర్సింహమూర్తి

మాడుగుల రూరల్: విద్యుత్ చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని కోరుతూ ఆదివారం రామచంద్రపురంలో సీపీఎం నాయకులు కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి ఇ. నర్సింహమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో ధరలను అదుపు చేయడంలో విఫలమైందన్నారు. పేదలపై పన్నుల భారాన్ని మోపుతుందని, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెంచిందన్నారు. పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాఖ వెళ్లి పింఛన్ల అందజేత



కేజీహెచ్‌లో నూకాలుకు పింఛన్ అందిస్తున్న వడ్డాది వలంటీర్ నాగమణి



అప్పలనాయుడుకు పింఛన్ అందిస్తున్న వడ్డాది వలంటీర్ భాను ప్రసాద్

బుచ్చెయ్యపేట: విశాఖలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు రోగులకు వలంటీర్లు సొంత ఖర్చులతో వెళ్లి పింఛన్ సొమ్ము అందించారు. వడ్డాది మేజర్ పంచాయతీకి చెందిన వృద్ధుడు బంధం నూకాలు అనారోగ్యంతో విశాఖ కేజీహెచ్‌లో పది రోజులుగా వైద్య సేవలు పొందుతున్నాడు. సిరికి అప్పలనాయుడు వారం రోజులుగా అనారోగ్యంతో విశాఖ కిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. అనారోగ్యంతో వైద్య సేవలు పొందుతున్న వీరు రోజువారి ఖర్చులకు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న గ్రామ వలంటీర్ల అధికారి సంతోషి కేజీహెచ్‌కు వెళ్లి, కచ్చర్ల భాను ప్రసాద్ కిమ్స్‌కు వెళ్లి పింఛన్ నగదు అందించారు.

7న హరేకృష్ణ సత్సంగం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు

అనకాపల్లిటౌన్: స్థానిక రావుగోపాలరావు కళాక్షేత్రం రహదారిలోని ఉప్పల చంద్రశేఖరరావు కల్యాణమండపంలో ఈనెల 7న శ్రీ కృష్ణ జన్మాష్టమి మహోత్సవాన్ని నిర్వహించనున్నట్టు హరేకృష్ణ సత్సంగ మందిరం అధ్యక్షుడు దుర్లబ కృష్ణప్రేమదాస్ ఆదివారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ఉట్టి ఉత్సవాన్ని జరుపుతాయని చెప్పారు. మధ్యాహ్నం 1500 మందికి అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 5 గంటలకు తులసిపూజ, 5.30 గంటలకు సంధ్యాహారతి, 6 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 7 గంటలకు శ్రీ రాధా కృష్ణులకు పంచామృత, ఫలరసాలతో సహస్ర కలశాభిషేకం, రాత్రి 9గంటలకు ఊంజల సేవ అనంతరం మహాప్రసాద వితరణ చేయనున్నట్టు ఆయన తెలిపారు.

లోపూడిలో అంబేడ్కర్, రంగా విగ్రహాల ఆవిష్కరణ



విగ్రహావిష్కరణలో నాయకులు

బుచ్చెయ్యపేట: లోపూడిలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, వంగవీటి రంగా విగ్రహాలను ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. అంబేడ్కర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని, రంగా ఏ వర్గానికో చెందిన వ్యక్తి కాదని అందరి వాడని పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షురాలు మంచా నాగమల్లేశ్వరి, రంగా మిత్ర మండలి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు కె.బుజ్జి, వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, చోడవరం జనసేన ఇన్‌చార్జి పి.వి.ఎస్.ఎన్ రాజు పాల్గొన్నారు.

మట్టి గణపతిని పూజించాలి



మట్టివినాయకున్ని పూజించాలని నెహ్రూ చౌక్‌లో ప్రచారం చేస్తున్న ఆదారి కుమారస్వామి

అనకాపల్లిటౌన్: పర్యావరణ పరిక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఈనెల 18వ తేదీన జరిగే వినాయక చవితి నాడు అందరూ వారివారి గృహాల్లోను, వీధులలో మట్టిగణపతిని పూజించాలని వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆదారి కుమారస్వామి కోరారు. స్థానిక నెహ్రూ చౌక్‌లో ఆదివారం మట్టి వినాయకులనే పూజించాలని కోరుతూ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది మట్టి గణపతిని పూజించాలని నినాదంతో ప్రచార కార్యక్రమాలను చేపడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పి.సోమశేఖర్ పట్నాయక్, ఆళ్ల నాగేశ్వరరావు, ఎస్.వి.కృష్ణ, కొప్పాక శంకరరావు, ఎం.మహేష్, ఆదారి శ్రీనివాసరావు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కంటి శస్త్రచికిత్సలకు 23 మంది ఎంపిక

నాతవరం: నేత్ర వైద్య శిబిరాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మంకు రమణమ్మ తెలిపారు. మర్రిపాలెంలో కాకినాడకు చెందిన అంజు ఇంటర్నేషనల్ కంటి ఆస్పత్రి సహకారంతో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో వైద్యుడు తేజ 126 మంది రోగులను పరీక్షించి, వారిలో 23 మందికి శస్త్రచికిత్సలు అవసరమని నిర్ధారించారు. మిగిలిన వారికి ఉచితంగా మందులు అందజేశారు. 23 మందిని రెండు రోజుల్లో కాకినాడ ఆస్పత్రికి బస్సులో తరలించి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని సర్పంచ్ తెలిపారు. గ్రామంలో ప్రజోపయోగ కార్యక్రమాల నిర్వహణకు యువత ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు మంకు సాంబమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.